## పునర్వినియోగ వాహక నౌక

పునర్వినియోగ వాహక నౌక ఎల్ఈఎక్స్-2 ప్రయోగాన్ని ఇస్రో విజయవంతం చేసింది. దీనికి పుష్పక్ అని పేరు పెట్టింది. కర్నాటకలోని బెంగళూరులో చిత్రదుర్గా వద్ద మార్చి 22న చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతం అయింది.



# అంతర్జాతీయం

### ఆపరేషన్ ఇంద్రావతి



- వివిధ వర్గాల మధ్య అల్లర్లు చెలరేగడంతో హైతీలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అక్కడ ఉన్న భారతీయులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు 'ఆపరేషన్ ఇంద్రావతి'ని భారత్ చేపట్టింది.

### ఐక్యరాజ్య సమితి

- శాంతి పరిరక్షక దళాలపై దాడులకు సంబంధించి జవాబుదారీని పెంచేందుకు 40 దేశాలతో కూడిన గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ రెండో సమావేశం జరిగింది. దీనికి భారత్ నాయకత్వం వహించింది. శాంతి పరిరక్షక దళాలపై దాడులు చేసే వారిని శిక్షించేందుకు న్యాయ వ్యవస్థలను బలోపేతం చేయడం, పరస్పరం దేశాల మధ్య సహకారం పెంపొందించుకొనే అంశాలను ఇందులో చర్చించారు.

### కృత్రిమ మేధపై తీర్మానం

- కృత్రిమ మేధపై తొలిసారిగా ఐక్యరాజ్యసమితి సాధారణ సభ తీర్మానాన్ని ఆమోదించింది. మానవ హక్కులు, వ్యక్తిగత సమాచారం, ఏఐతో పొంచి ఉన్న ముప్పు తదితర అంశాలను ఇందులో ప్రస్తావించారు.

### భద్రతా మండలి

- ఇజ్రాయెల్, పాలస్తీనా హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కోరుతూ భద్రతా మండలిలో తీర్మానాన్ని ఆమోదించారు. తీర్మానానికి 14 సభ్య దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. అమెరికా గైర్హాజరయ్యింది. అయితే ఇజ్రాయెల్ పౌరులను హమాస్ నిర్బంధించింది. వారందరిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

### యూఎన్ ఉమెన్

- ప్రపంచంలో లింగ సమానత్వం కోసం తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి 68వ యూఎన్ మహిళా సమావేశం మార్చి 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించారు. యూఎన్-ఉమెన్ అనే సంస్థ న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తుంది. ఈ సమావేశంలో లింగ సమానత్వం సాధించేందుకు యత్నాలను వేగవంతం చేయడం, ఇందుకు కావాల్సిన వనరులను సమకూర్చడంతో పాటు మహిళలు, బాలికల సాధికారత సాధించాలని నిర్ణయించారు.

### ఇంటర్ పార్లమెంటరీ యూనియన్

- ఉగ్రవాదానికి ఊతం ఇస్తున్న పాకిస్థాన్‌ను భారత్ విమర్శించింది. ద్వైపాక్షిక చర్చలతో సమస్యను పరిష్కరించుకొనేందుకు ఆ దేశం కలిసి రాకపోవడాన్ని తప్పు పట్టింది. ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ 148వ సమావేశం సంస్థ ప్రధాన కార్యాలయం అయిన జెనీవాలో నిర్వహించారు. ఇందులోనే ఈ అంశాలను భారత్ ప్రస్తావించింది. ఈ సమావేశానికి భారత్ తరపున రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పాల్గొన్నారు.

### ఇంటర్నేషనల్ సీ బెడ్ అథారిటీ

- జమైకాలోని కింగ్‌స్టన్ కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తుంది. నికితిన్ సీమౌంట్, కార్ల్స్‌బెర్గ్ రిడ్జ్‌లలో అన్వేషణ హక్కుల కోసం భారత్ ఈ సంస్థలో దరఖాస్తు చేసింది. నికితిన్ సీమౌంట్ అనే ప్రాంతంలో కోబాల్ట్ అధికంగా ఉంటుంది. కార్ల్స్‌బెర్గ్ రిడ్జ్‌లో పాలిమెటాలిక్ సల్ఫైడ్స్ ఉన్నాయి. నిజానికి ఈ ప్రాంతాలు శ్రీలంక పరిధిలో ఉన్నాయి. అందుకే భారత్ అనుమతిని కోరింది. ఇంటర్నేషనల్ సీ బెడ్ అథారిటీని యూఎన్ సీఎల్‌వోఎస్ ఒప్పందంలో భాగంగా 1994లో ఏర్పాటు చేశారు.

### గ్రహ శకలానికి భారత శాస్త్రవేత్త పేరు

- ఇంటర్నేషనల్ ఆస్ట్రానామికల్ యూనియన్ అంతరిక్షంలోని గ్రహ శకలానికి భారత శాస్త్రవేత్త జయంత్ మూర్తి పేరును పెట్టింది. ఆ గ్రహ శకలం పేరు 215884 జయంత్ మూర్తి అని పిలవనున్నారు. అలాగే చంద్రయాన్-3 చంద్రుడిపై దిగిన చోటును శివశక్తి అనే పేరును ఖరారు చేసింది. ఖగోళ వస్తువులకు పేర్లు పెట్టే అధికారం ఇంటర్నేషనల్ ఆస్ట్రానామికల్ యూనియన్‌కు ఉంది. ఇది పారిస్ కేంద్రంగా పనిచేస్తుంది.



### నీటిపై నివేదిక

- అభివృద్ధి-శాంతి కోసం నీరు అనే అంశంపై దృష్టి సారిస్తూ ఐక్యరాజ్య సమితి నీటి అభివృద్ధి నివేదిక-2024ను విడుదల చేసింది. పలు కీలక అంశాలను ప్రస్తావించారు. రానున్న రోజుల్లో దేశాల మధ్య యుద్ధాలు నీటి కోసం జరుగుతాయని నివేదికలో వెల్లడించారు. ప్రస్తుతం 70 శాతం మంచినీటిని వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. పరస్పర సహకారంతో నీటిని సమర్థంగా వినియోగించుకుంటేనే ముప్పు తప్పుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.

### అంతర్జాతీయ కార్మిక సంస్థ

- వెట్టిచాకిరీ వల్ల ఏటా ప్రపంచంలో 36 బిలియన్ డాలర్ల అక్రమ సంపద సృష్టిస్తున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ అధ్యయనం తేల్చింది. జెనీవా కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. 2014తో పోలిస్తే వెట్టిచాకిరీ 37 శాతం పెరిగింది. ప్రైవేట్ వ్యక్తులు దీనివల్ల 236 బిలియన్ డాలర్లు ఆర్జించారు. ప్రతి బాధితుడి నుంచి సుమారు 10 వేల డాలర్ల అక్రమ రవాణాకు పాల్పడే వారు సంపాదిస్తున్నారని నివేదిక వెల్లడించింది.

### అమెరికాలో అమూల్ పాలు

- అమూల్ పాల ఉత్పత్తులు అమెరికాలో తొలిసారి అందుబాటులోకి రానున్నాయి. గుజరాత్ పాల సహకార మార్కెటింగ్ సమాఖ్య అక్కడ ఈ ఉత్పత్తులను విక్రయించనున్నది..

### డిస్పోజబుల్ ఈ-సిగరెట్లు

- డిస్పోజబుల్ ఈ-సిగరెట్లు లేదా వేప్స్‌ను పూర్తిగా నిషేధించాలని న్యూజిలాండ్ నిర్ణయించింది. వీటిని మైనారిటీలకు విక్రయిస్తే భారీగా జరిమానా కూడా విధించాలని నిర్ణయించింది.

### సైనిక విన్యాసం

- భారత్, మొజాంబిక్, టాంజానియా ఉమ్మడి సైనిక విన్యాసాలను మార్చి 21 నుంచి 29 వరకు నిర్వహించాయి. ఇందులో హార్బర్, సముద్ర దశలు ఉన్నాయి. జాంజిబార్ (టాంజానియా), మపుటో, నకల (మొజాంబిక్) తదితర ప్రాంతాల్లో ఇవి కొనసాగాయి.

# తెలంగాణ

### ఫ్రాన్స్‌తో ఒప్పందం

- తెలంగాణ, ఫ్రాన్స్‌ల మధ్య సహకారానికి బ్యూరో డి ఫ్రాన్స్ అనే కార్యాలయం హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చింది. ఆ దేశ రాయబారి థియెరీ మతౌ దీన్ని ప్రారంభించారు.



### శాసనం లభ్యం

- 900 సంవత్సరాల నాటి కన్నడ లిపితో కూడిన ఒక శాసనాన్ని తెలంగాణలోని గంగాపురంలో గుర్తించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇది లభించింది. కల్యాణి చాళుక్య వంశానికి చెందినది.

### హైకోర్ట్ భవనం నిర్మాణం

- తెలంగాణలో హైకోర్ట్ నూతన భవన నిర్మాణానికి భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ శంకుస్థాపన చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో దీన్ని నిర్మిస్తున్నారు.



# జాతీయం



### వ్యవసాయంలో సాంకేతికత

- వ్యవసాయ పద్ధతుల్లో సాంకేతికతను తీసుకొచ్చే లక్ష్యంతో కృషి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఢిల్లీలో ప్రారంభించారు. కృత్రిమ మేధ, రిమోట్ సెన్సింగ్, జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ తదితర ఆధునిక పద్ధతులను వినియోగించుకొనేందుకు ఈ కేంద్రం వీలుగా ఉంటుంది. కిసాన్ 2-మిత్రతో పాటు ఇతర యాప్‌ల ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని ఇస్తారు.

### ఓటు హక్కు

- వేర్వేరు ప్రాంతాల్లో మీడియా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులకు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకొనేందుకు అర్హులను చేసింది. ఇప్పటికే పలు నిబంధనలను సడలించిన సంగతి తెలిసిందే. 85 సంవత్సరాలు పైబడిన వారు, అలాగే 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు.

### స్మారక కట్టడాలు

- 18 కట్టడాలను 'స్మారక చిహ్నాల' జాబితా నుంచి తొలగించాలని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే ఈ జాబితాలో 3693 ఉన్నాయి. 18 తొలగిస్తే స్మారకాల సంఖ్య 3675కు చేరుకుంటుంది.

### ఈ-శ్రమ్ పోర్టల్

- ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్ట్ ఆదేశించింది. రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. ఈ పోర్టల్‌లో మొత్తం 29 కోట్ల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. సుమారు 8 కోట్ల మందికి రేషన్ కార్డులు లేనందున జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని వినియోగించుకోలేకపోతున్నారు.

### డీ-ఎస్ఐఐ

- 2023-24కు ఎల్ఐసీ, జీఐసీ, న్యూ ఇండియా అస్యూరెన్స్ సంస్థలను డొమెస్టిక్ సిస్టమేటికల్లీ ఇంపార్టెంట్ ఇన్సూరర్స్ అనే జాబితాలో చేర్చింది. పటిష్టమైన మార్కెట్ వ్యవస్థను కలిగి, విఫలమయ్యేంత బలహీనంగా లేని బీమా సంస్థలను ఈ జాబితాలో చేరుస్తారు. అలాగే బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ అనే భారత జీవిత బీమా సంస్థను ప్రశంసించింది. ప్రపంచంలోనే అత్యంత బలమైన జీవిత బీమా సంస్థగా పేర్కొంది.



### ఏఎఫ్ఎస్‌పీఏ

- నాగాలాండ్‌లోని కొన్ని జిల్లాల్లో సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం-1958ని ఆరు నెలల పాటు పొడిగించారు. ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

# క్రీడలు

### డబ్ల్యూటీటీ

- ప్రపంచ మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి శ్రీజ ఆకుల విజయం సాధించింది. తుదిపోరులో ఆమె లక్సెంబర్గ్‌కు చెందిన సరడి నుట్టేను ఓడించింది.

### సన్‌రైజర్స్ రికార్డ్

- ఐపీఎల్ మ్యాచుల్లో భాగంగా సన్ రైజర్స్ సంచలనం సృష్టించింది. హైదరాబాద్‌లో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన టీ-20 మ్యాచ్‌లో ఏకంగా 277 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో ఇదే అత్యధిక స్కోర్.

# వార్తల్లో వ్యక్తులు

### అభయ్ ఠాకూర్



- మయన్మార్ దేశానికి భారత రాయబారిగా నియమితులయ్యారు.

### బసిరౌ డియోమయే

- సెనెగల్ దేశానికి తదుపరి అధ్యక్షుడిగా బసిరౌ డియోమయే ఫాయే నియమితులయ్యారు.

### రితురాజ్ అవస్తి

- న్యాయ కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న రితురాజ్ అవస్తి తన పదవికి రాజీనామా చేశారు. ఆయన లోక్‌పాల్ సభ్యుడిగా నియమితులయ్యారు.

### సదానంద్ వసంత్

- ఎన్ఐఏ కొత్త డైరెక్టర్ జనరల్‌గా సదానంద్ వసంత్ నియమితులయ్యారు.

### పీయూష్ ఆనంద్

- ఎన్‌డీఆర్ఎఫ్‌కు నాయకత్వ బాధ్యతను పీయూష్ ఆనంద్‌కు అప్పగించారు.

### రాజీవ్ కుమార్



- బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు డైరెక్టర్ జనరల్‌గా రాజీవ్ కుమార్ నియమితులయ్యారు.

### పవన్ దావులూరి

- మైక్రోసాఫ్ట్ సంస్థ అంతర్గతంగా విండోస్, సర్ఫేస్ బృంద వ్యవస్థను విలీనం చేసింది. దీనికి పవన్ దావులూరి నేతృత్వం వహిస్తారు. ఆయన ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి.

### లూయిస్ మాంటెనీగ్రో

- పోర్చుగల్ దేశానికి కొత్త ప్రధానిగా నియమితులయ్యారు.

### నవీన్ జిందాల్

- ఇండియన్ స్టీల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నవీన్ జిందాల్ ఎన్నికయ్యారు.

### సులేమాన్

- మైక్రోసాఫ్ట్ ఏఐ విభాగానికి సులేమాన్ నేతృత్వం వహించనున్నారు. అతను గూగుల్‌కు చెందిన డీప్‌మైండ్ సహ వ్యవస్థాపకులు. తాజా నియామకంతో గూగుల్ సీఈవో సత్య నాదెళ్లకు నేరుగా ఆయన నివేదించనున్నారు.

### నరేంద్ర మోదీ

- 'ఆర్డర్ ఆఫ్ ది డ్రూక్ గ్యాల్ పో' అవార్డును ప్రధాని నరేంద్ర మోదీ అందుకున్నారు. ఇది భూటాన్ అత్యున్నత పురస్కారం. ఈ అవార్డును పొందిన తొలి భూటానేతర వ్యక్తి నరేంద్ర మోదీ.


### మిచెల్ తలగ్రాండ్



- 2024 అబెల్ ప్రైజ్‌ను ఫ్రాన్స్‌కు చెందిన తలగ్రాండ్‌కు ఇచ్చారు. గణితంలో దీన్ని నోబెల్ బహుమతిగా పరిగణిస్తారు.

# రోజులు

### ప్రపంచ ట్యూబర్‌క్యులోసిస్ డే




- ఏటా మార్చి 24న ప్రపంచ ట్యూబర్‌క్యులోసిస్ డేని నిర్వహిస్తారు. ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచాలన్నది లక్ష్యం. ఈ ఏడాది ఇతివృత్తం 'అవును మనం టీబీని నివారించగలం'.

### ప్రపంచ కబడ్డీ రోజు

- ఏటా మార్చి 24న ప్రపంచ కబడ్డీ రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ క్రీడా వేడుకలు హర్యానాలోని పంచకులలో తౌదేవీలాల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. బంగ్లాదేశ్ జాతీయ క్రీడ కబడ్డీ.

### ప్రపంచ వాతావరణ రోజు




- ఏటా మార్చి 23న ప్రపంచ వాతావరణ రోజుగా నిర్వహిస్తారు. జెనీవా కేంద్రంగా ప్రపంచ వాతావరణ సంస్థ పనిచేస్తుంది. 1950 మార్చి 23న ఈ సంస్థ యూఎన్‌వోకు అనుబంధంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ తేదీని ప్రపంచ వాతావరణ సంస్థగా జరుపుతారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

